


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

35

(సెప్టెంబర్ ౨,'71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**సామాన్యంగా సంసారాలలో** చిలిపి తగువులూ, చిల్లర సంభాషణలూ రావడం మనం వింటూ ఉంటాం. ఇంతకాలంగా హాయిగా కాపురం చేస్తున్న దంపతులిద్దరూ ఒక్కసారిగా తగవుల్లోకి దిగారేమిటా అనిపిస్తుంది.

పూర్వగ్రంధాలు వగైరాలలో పొలియకలనీ, చిడిముడులనీ, చిరుకోపాలనీ ఎన్నో వర్ణిస్తూ వచ్చారు. ఇప్పుడు పొలయలుకలతో ఎక్కడా సంబంధం ఉండటం లేదు. బయటపడి పోట్లాడుకోవడం దాకా వచ్చేస్తోంది. గృహిణి ఏదో కొంచెం తప్పు చేస్తుందనుకోండి ఆయనగారు వెంటనే ప్రారంభిస్తాడు.

"నీకు బుద్ధి లేదు."

"ఇప్పుడు తెలుసుకున్నారా! అయ్యో? ఎంత ఆలస్యమైంది?"

***మీది అసలు చాలా బండ వంశం***

"తెలుసుకుని చాలాకాలమైంది. కానీ ఎందుకు బయట పెట్టడమని ఊరుకున్నాను. మీది అసలు బండవంశం"

"అవును. అదీ కనిపెట్టారన్నమాట. మీ దగ్గిర ఏదీ దాగటం లేదమ్మ. సుకుమార వంశంలో వచ్చి నేను పడ్డాను. పూలవనంలో రాతిబండ వచ్చిపడ్డట్లు."

"మా వంశ గౌరవం మీకేం తెలుస్తుంది? బండకేం తెలుస్తుంది పచ్చడి రుచి. ఎలాగో కాలక్షేపం చేస్తున్నాం గాని. "

"అంతే మరి, మీరు కాబట్టి ఎలాగో సర్దుకుపోతున్నారు - బుర్ర ఉడికిపోతూ ఉండాలి పాపం. పోనీ కొంచెం రుద్దమన్నారా"

"అదికూడా ఎందుకు భస్మాసుర వరం. ఏమీ అక్కర్లేదులే. ఇట్లా బ్రతకనియ్యి"

"చిరంజీవులుగా వర్ధిల్లండి. అలాటి పొరపాట్లు నేనేం చెయ్యను. మీరు నామూలకంగా శ్రమే కాకుండా ఎంతో బయపడుతున్నారన్నమాట. గట్టిగా చెప్పేస్తే మూట కట్టుకుని పుట్టింటికి చక్కాపోతాను" -

***ఇంతకీ ఎర్ర పెన్సిలు ముక్క ఎక్కడుంది?***

"ఎందుకూ.. నేనే పోయి ఏ యతీంద్రుల్లోనే కలుస్తాను. ఒక్కసారి జై పరమేశ్వరా అంటే యోజనాల దూరంలో వెళ్ళి వ్రాలతాను. నీ గోరోజనం అంతా తీరిపోతుంది ఇంతకీ ఎర్ర పెన్సిలు ముక్క వెతుకుతావా లేదా! దానికింత మంట మండించావు."

ఇలా మధ్య మధ్య ఏ చిన్న విషయంలోనో భార్యా భర్తల మధ్య చిరుమంటలు లేస్తూ ఉంటాయి. దీన్నే "సంసారంలో షార్టు సర్క్యూటు" అంటారు - కాసేపు నిదానిస్తే కార్యసాధన జరుగుతుంది. కానీ అంత సహనం ఎక్కడనుంచి వస్తుంది.

కొంచెం ఆధునిక సాంప్రదాయాలు గల సంసారాల్లో తగాదాలు మరి ఒకరకంగా ఉంటాయి.

"నేను ఆఫీసు నుంచి కొంచెం ఆలస్యంగా వస్తాను."

"ఇవ్వాళ క్లబ్‌లో సదస్సు ఒకటి ఉంది. మీరే ముందు వస్తారేమో. వస్తే పిల్లల చెంత అన్నం తినిపించి వెయ్యండి."

"కొంచెం త్వరగా రావడానికి ప్రయత్నించరాదూ"

"ఎలా ప్రయత్నించడం నేను కార్యదర్శిని. ఆ మాట మీకు ఎన్నిమాట్లు గుర్తు చెయ్యాలి. నలుగురూ ఏమంటారు"

"నలుగురూ ఏమంటారో నాకు తెలియదు గానీ - నేను మటుకు మామూలు సభ్యురాలుగా ఉండమంటాను సంసారాలు చేసేవారికి.

"మీరు పొరపడుతున్నారంటాను."

"నాది పొరపాటంటారా!"

"ముమ్మాటికీ ట్రూత్ గ్రహించలేకపోతున్నారు."

"ఏమిటి ట్రూత్. పిల్లల్ని వదిలి అర్ధరాత్రి దాకా తిరగడం, భర్తను ఇంటిపనులు చేయమనడం. సంసారాలకంటే సదస్సులు ఎక్కువ అనడం - ఇవన్నీ అసలు ధర్మాలా"

<u>*చదివారు ఎమ్మే ఎన్నో ఉపన్యాసాలిచ్చారు.*</u>

"ఔను. నాకు అలా చేయడంలో కొంత తృప్తి ఉంది. సంతృప్తి లేని జీవితాలు ఎలా ఉంటాయో తెలియదా! ఎమ్మే చదివారుగా - ఎన్నో ఉపన్యాసాలిస్తూంటారుగా"

"ఉపన్యాసాలు వేరు. సంసారాలు వేరు. ఇవి అంత తేలికగా సాగవు. శ్రమపడాలి. శ్రద్ధ తీసుకోవాలి. నువ్వు పిల్లల విషయంలో ఇలా ప్రవర్తిస్తే వారిని తీసుకువెళ్ళి ఏ కాన్వెంటులోనో అప్పగించి వస్తాను."

"నాకేం అభ్యంతరం లేదు. కాన్వెంటులో దింపినా మంచిదే, ఈ చీకటింటిలో పడేసి పెంచడంకంటే. వాళ్ళ కేమన్నా ప్రత్యేక సౌకర్యాలా! వినోద కార్యక్రమాలా! అమ్మకు అప్పగించడం - అంతా సతమతమై పోయిన తర్వాత అర్ధరాత్రి వచ్చి తలుపు కొట్టడం. తల్లికంటే తండ్రికే ఎక్కువ బాధ్యత ఉంది. సరిగా గ్రహించగలిగితే"

"గ్రహించడం ఏం లోటు లేదు. తమరు అనుగ్రహించడం లేదనే బాధే తప్ప ఇంతకీ రాత్రి పెందరాళే రానంటావు. అయితే వాళ్ళను కూడా తీసుకువెళ్ళు"

"ఇంకా నయం ఆ కాస్త గాలి పీల్చుకోకుండానా! రెండు గంటలు స్వేచ్ఛా వాయువులు పీల్చందే ఎలా బ్రతకడం. ఎందరు రావడంలేదు పిల్లల్ని వదిలిపెట్టి . నేనేనా! అందులో నేను కార్యదర్శిని."

<u>*కార్యదర్శిగా - కొంచెం మార్గదర్శిగా ఉండు.*</u>

"అందువల్లనే చెపుతున్నాను. వాళ్ళకు కొంచెం మార్గదర్శకంగా కూడా ఉండు. ఇళ్ళదగ్గిర పిల్లలు వంటరిగా ఉండి ఎలా భయపడుతూ ఉంటారో బోధించి ఏడుగంటలకు సభ చాలించి, ఎవరింటికి వారిని దయచెయ్యమని చెప్పచక్కారా"

"ఇవ్వాళ ఏమవుతుందో. నేను కార్యదర్శిని. తలుపులు మూసేదాకా ఉండవలసిందే తాళాలు చేత పట్టుకుని రావలసిందే అది నా గౌరవ పదవి."

"ఇది అగౌరవ పదవా! దయచేసి ఆ పదవికి రాజీనామా ఇయ్యి. నీ ఇష్టం వొచ్చిన కారణాలు ఏమన్నా వ్రాయి."

"మరీ అలాటి బూజుపట్టిన మాటలు మాట్లాడతారేం. ఇంత పేరు సంపాదిస్తున్నానని సంతోష పడటం చేతకాదు సరిగదా - చెడు సలహాలు కూడా ఏమిటి?"

"చేస్తున్న సంసారం ఒకటి ఉన్నది గనుక"

***నవ్వుతుంటే కాళ్ళు బయటికి నడిపించవు***

"మీరు చూస్తూ ఊరుకోండి. సంసారానికేం హాయిగా సాగిపోతుంది. అందరి సంసారాల వంటిదే మనదీ."

"సరే! సరే! ఆఫీసు వేళ అయింది. ఇక ఆ బిగి ముడులు తొలగించుకొని చిలకలాగా నవ్వు ఒకసారి. చూచి చక్కా పోతాను. సాయంత్రం పెందరాళే నే వస్తాలే -"

"మరి ఇంత రగడ దేనికి. రామాయణం దేనికి? ముందే ఈ మాట చెప్పకపోయారా! చక్కగా గడిపేవాళ్ళంగా నవ్వులతో"

"ఆఫీసుకు వెళ్ళేముందు అంతగా నవ్వులు సాగితే బయటకి అడుగు పెట్టడం - చాలా కష్టం. అందుకని చిరుకోపం" అంటూ ఆయన వెళ్ళి పోయాడు.

చివరమాటలు, ఓడిపోయి మాట్లాడినవే. అసలు ఉద్దేశ్యం ఆవిణ్ణి దబాయిద్దామనే. కాని సాగక పాపం.

Click here to share your comments on this story